# పేతురు 1, 2 పత్రికలను ఎందుకు వ్రాసెను

## Why Peter Wrote I & II Peter

ఈ పత్రికలు ఎందుకు వ్రాయబడినవి? బైబిలులోని ప్రతి పత్రికను గూర్చి యేసు క్రీస్తు శిష్యులు అడుగవలసిన మొదటి ప్రశ్న ఇది. ఈ పత్రికలను బైబిలు వ్యాఖ్యాన సూత్రముల ప్రకారము చదువుటకు ఈ ప్రశ్న మరియు ఇలాంటి ప్రశ్నలు అడుగవలసియున్నది. లేఖనములపై మన పూర్వభావములను రుద్దకుండ కాపాడుటకు ఈ వ్యాఖ్యాన సూత్రము మనకు సహాయ పడుతుంది.

"ఏర్పరచబడిన" వారు ఆలోచించునట్లు వారిని కదలించుట కొరకు ఈ రెండు పత్రికలు వ్రాశానని అపొస్తలుడైన పేతురు చెప్పినాడు. వారే కాదు, క్రైస్తవులందరూ ఆలోచించాలి, అయితే, పేతురు తన గ్రహీతలు వారి మనస్సులను ఎంతగా లగ్నము చేయాలని కోరుకొన్నాడో, మనము ఎప్పుడూ అంతగా ఆలోచించకపోవచ్చును. అతని పత్రికలు, సంఘములలోని ప్రతి వ్యక్తిగత సభ్యుడు, మనము కూడా "ఆరోగ్యకరమైన ఆలోచన" చేయునట్లు పురికొల్పుటకు వ్రాయబడినవి. పేతురు ఖచ్చితముగా ఈ పత్రికలు ఎందుకు వ్రాశాడో మనకు చెప్పాడు. మనము జాగ్రత్తగా ఆలకించవలెను.

> *ప్రియులారా, ఈ రెండవ పత్రిక మీకిప్పుడు వ్రాయుచున్నాను పరిశుద్ధ ప్రవక్తల చేత పూర్వమందు పలకబడిన మాటలను, ప్రభువైన రక్షకుడు మీ అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞను మీరు జ్ఞాపకము చేసుకొనవలెనను విషయమును మీకు జ్ఞాపకము చేసి, నిర్మలమైన మీ మనస్సులను రేపుచున్నాను.*
>
> *2 పేతురు 3:1, 2*

**మాట నిర్వచనము:**

రేపు (stimulate) అను మాట గ్రీకు మాటయైన diegeiro నుండి తర్జుమా చేయబడినది. దాని అర్థం "ముందు వెనుకలకు కదలుట" లేక " వాడుటకు ముందు బాగుగా ఊపవలెను"(shake before use) అని కొన్ని ముందు సీసాల మీద అంటించిన చీటి మీద చదివినట్లు "కదులుట." ఆ విధముగా ఈ సందర్భములో, ప్రభువైన యేసును గూర్చి మరియు పరిశుద్ధ ప్రవక్తల సందేశమును గూర్చి వారికేమి చెప్పబడినదో దానిని గూర్చి ప్రతి సంఘ సభ్యుడు తిరిగి పరీక్షించు కొనవలెనని దీని భావము. ఈ ఆలోచన మొదట 1 పేతురు 1:13లో పరిచయం చేయబడినది.

నిర్మలమైన (pure) అను మాట గ్రీకు మాటయైన eilikrines నుండి తర్జుమా చేయబడినది. దాని అర్థం "అమిశ్రిత పదార్థము." మరో విధముగా చెప్పవలెనంటే, "క్రీస్తునందు" వారి యొక్క ప్రస్తుత వాస్తవికతను వారు పరీక్షించునప్పుడు, మానవ జ్ఞానము చేత ప్రభావితము చెందకూడదని పేతురు తన గ్రహీతలను కోరియున్నాడు. యేసుక్రీస్తు అపొస్తలుల ద్వారా వారికి దేవుని జ్ఞానము బోధింప బడినది; కాబట్టి వారి ఆత్మీయ వాస్తవికతను గూర్చి వారికి సమాచారమున్నది. దేవుని రాజ్యమును గూర్చి మరియు దానిలో వారి పాత్రను గూర్చి వారికి సత్యము తెలుసు (2 పేతురు 1:12). "దేనియందు వారు స్థిరముగా స్థాపింపబడిరో" దానిని గూర్చి వారు ఆలోచించవలెనని మరియు ధ్యానించవలెనని వారిని ప్రోత్సహించు ఉద్దేశముతో పేతురు వ్రాశాడు. వారి ప్రస్తుత మరియు భవిష్యత్ "ప్రపంచ దృక్పథం"లో "ఏర్పరచబడిన" వారిగా జీవించుటను గూర్చి వారు ఆలోచించవలెనని అతడు వారిని ప్రోత్సహించినాడు.

మనస్సులు లేక ఆలోచన అను మాటలు గ్రీకు మాటయైన dianoia నుండి తర్జుమా చేయబడినది. దాని అర్థము, "ద్వారా ఆలోచించుట." కాబట్టి, పేతురు గ్రహీతలను ప్రోత్సహించు టకు వ్రాశాడు. మరియు"వారివలె అమూల్య విశ్వాసము పొందిన" క్రైస్తవులందరిని ప్రోత్సహించు టకు వ్రాశాడు. వీరందరు, పేతురు మరియు ఇతర అపొస్తలుల ద్వారా బోధింపబడిన యేసుక్రీస్తు ఆజ్ఞలను ధ్యానించవలెను.

పాతనిబంధనలోని "పరిశుద్ధ ప్రవక్తలతో," కలిపి ప్రభువు, రక్షకుని యొక్కఆజ్ఞలు బోధింప బడిన క్రైస్తవులందరి ద్వారా రెండు పత్రికలలోని సమాచారమంతయు అర్థము చేసికొనబడవలెను. దేవుని కొరకు యేసు నిర్మించుచున్న సంఘము క్రొత్త భావము కాదు. దేవుని పిల్లలయిన క్రైస్తవుల మహిమ కొరకు జగత్తుపునాదికి ముందే యేసుక్రీస్తు ఏర్పరచబడినాడు (1 కొరింథీ. 2:6-10; 1 పేతురు 1:20, 21; 2: 9, 10). యేసుక్రీస్తు భూమిపై తన పనిని ముగించుచుండగా, "మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తలగ్రంథము లోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నీ" నెరవేర్చబడినవని ఆయన చెప్పినాడు (లూకా 24:44). "క్రీస్తు విషయమైన శ్రమలను గూర్చియు, వాటి తరువాత కలుగబోవు మహిమలను గూర్చియు" ప్రవక్తలు ముందుగా ప్రకటించినారు (1:11). పేతురు పత్రిక యొక్క గ్రహీతలు, అపొస్తలుడైన పౌలు పత్రికలు పొందియుండుట వలన వారు కొంత కాలముగా సంఘసభ్యులైయున్నారు (2 పేతురు 3:15). యూదులు అన్యులు ఇద్దరూ కలసి ఉన్న సంఘ సహవాసము ఇకముందు ఇద్దరుగా గుర్తింపు కలిగిలేరు. కొందరు ఇంతకముందు అన్యులైనప్పటికి, ఇప్పుడు వారందరూ "క్రీస్తు నందు" పేతురునకు ప్రియమైన స్నేహితులు (1 పేతురు 4:12; 2 పేతురు 3:1, 17). "యూదుడని గ్రీకు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు యేసుక్రీస్తునందు మీరందరూ ఏకముగా ఉన్నారు" గలతీ. 3:28 (చూడు రోమా 9:25, 26) అని దేవుని ద్వారా ప్రవక్తలు ప్రకటించిన సందర్భమిదే.

పేతురు వ్రాసే సమయానికి సంఘములు పెద్దల పైవిచారణ క్రింద ఉన్నవి. సభ్యులు యేసును చూడకపోయినప్పటికి, ఆయనను గూర్చి బోధింపబడుటవలన సత్యమందు స్థాపింపబడి

యున్నారు (1 పేతురు 1:8, 12, 25; 2:24; 3:15; 4:10, 13; 2 పేతురు 1:12; 3:14). పేతురు పరిపక్వత చెందిన సంఘములకు వ్రాస్తున్నడను సంగతి ఆయన పత్రికలు చదివే మనము మన మనస్సునందు ఉంచుకొనవలసియున్నది. "అతని గుడారము త్వరగా విడిచిపెట్టవలసి వస్తుందని" యేసు అతనికి చెప్పిన తరువాత అతడు రెండవ పత్రికను వ్రాశాడు (2 పేతురు 1:13-14). అందరి క్రైస్తవులవలె వారు కూడ, "ప్రభువునందు దేవుని పరిశుద్ధ ఆలయము"నందు తగినట్లుగా ఉన్నారు. ఆయన వారికి క్రొత్త సంగతులు బోధించటానికో, లేక ఏదైనా ఒక ప్రత్యేక సమస్యను సవరించుటకో వ్రాయలేదు (1 పేతురు 2:1-3; ఎఫెసీ. 2:19-22). అతడు వారిని భవిష్యత్ సవాలుల కొరకు సిద్ధపరుస్తున్నాడు (2 పేతురు 2:1-3:16).

రెండు పత్రికలు కూడ, భౌతిక ప్రపంచ అంత్యదినము యొక్క సందర్భములో తమ ప్రభువు యొక్క ఆజ్ఞలను గూర్చి ప్రతి క్రైస్తవుడు ఆలోచించ శక్తిగలవారైయుండు నట్లు వారిని పురికొలుపుటకు వ్రాయబడినవి. అంత్యదినముల యొక్క మొదటిరోజు, యేసు పరమునకు తిరిగి వెళ్ళిన తరువాత మొదటి పెంతుకొస్తు రోజున ప్రారంభమైనది (అపొ. కార్య. 2:1-4, 17, 18). నూతన సంఘములు వెంటనే అవిశ్వాసులైన యూదుల ద్వారా ఎదిరింపబడినవి; ముఖ్యముగా ప్రధాన యాజకత్వపు అధికారం కలిగి ఉన్న పరిసయ్యులు, సద్దూకయ్యుల ద్వారా ఎదిరింపబడినవి (అపొ. కార్య. 4:5-7; 8:1-3). అపొస్తలులు మరణించకముందు, అబద్ద బోధకులు, నాస్తికులు సంఘమునకు క్రొత్త సవాళ్ళను తెచ్చిపెట్టినారు. ఈ క్రొత్త దాడులను ఎదుర్కొనుట కొరకు సంఘములను బలపరచు టకు పేతురు వ్రాశాడు. "అంత్యదినములలో అపహాసకులు అపహసించుచూ వచ్చి, తమ స్వకీయ దురాశలచొప్పున నడుచుకొనుచు (2 పేతురు 3:3) అని ప్రవచించాడు. ఈ వ్యాపారస్తులైన బోధకులనుగూర్చి ఆయన వారినిలా హెచ్చరించాడు, "వారు అధిక లోభులై, కల్పనావాక్యములు చెప్పుచు, మీ వలన లాభము సంపాదించుకొందురు" 2 పేతురు 2:3. యూదా సంబోధించిన సంఘములలో ఇది ఇంతకు ముందే సంభవించియున్నది.

"అయితే ప్రియులారా, అంత్యకాలమునందు తమ భక్తిహీనమైన దురాశలచొప్పన నడుచు పరిహాసకులుందురని మన ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు మీతో చెప్పిన మాటను జ్ఞాపకము చేసికొనుడి" యూదా 17, 18 అని యూదా సంఘములకు గుర్తుచేశాడు. ఆ తరువాత అతుడు ఫలితాన్ని ప్రకటించాడు. "అట్టివారు ప్రకృతిసంబంధులను ఆత్మలేని వారునై యుండి భేదములు కలుగజేయుచున్నారు" యూదా 19. యూదా సంబోధించిన సంఘములకు సమస్య ఉన్నది, ఆ సమస్య ఉన్నట్లు వారికి తెలియదు. వారి సమస్య తీవ్రమైనదిగా ఉన్నది. అలా ఎందుకుజరిగిన దంటే, వారికేమి బోధింపబడినది, వారి సహవాసములో ఏమి జరుగుచున్నది అను వాటిని గూర్చి వారు "సంపూర్ణ ఆలోచన" చేయకపోవుటవలన జరిగినది. పేతురు తన రెండవ పత్రిక వ్రాసే సమయములో వ్యాపారస్తులైన బోధకులు మత నాయకులవలె నటించుట సర్వసాధారణమైనది (2 పేతురు 1:13-15; 2:1-3). ఇతరులు అనుచరుల కొరకు వెదుకుచున్న నాస్తిక తత్వవేత్తలైయుండవచ్చును.

పేతురు ప్రకటన యొక్క ఉద్దేశమును మన మనస్సులో ఉంచుకొని, అతని రెండు పత్రికలను మనము చదువవలసిన అవసరమున్నది. మనకు ప్రత్యేకముగా, ఈ రెండు పత్రికలు నిర్మలమైన మీ మనస్సులను రేపుటకు వ్రాయుచున్నాను (2 పేతురు 3:1, 2) అని చెప్పబడకపోయినట్లయితే, అతని మొదటి పత్రిక వ్రాయుట కొరకైన కారణములను గూర్చి మనము వేరే విధముగా ఆలోచించి ఉండేవారము. ఇది ప్రత్యేకమైన చారిత్రక ప్రకటన. దానిని మనం ఎరుగనట్లుండకూడదు. మొదటి పత్రికను గూర్చి మరియు రెండవ పత్రిక మొదటి అధ్యాయమును గూర్చి మనమడుగవలసిన ప్రశ్న: "గ్రహీతలు సంపూర్ణ ఆలోచన కలిగియుండునట్లు వారిని పురికొల్పుటకు ఈ సమాచారము ఎలా పనిచేస్తుంది?" పరిశుద్ధ ప్రవక్తలచేత పూర్వమందు పలుకబడిన మాటలను... మీరు జ్ఞాపకము చేసికొనవలెను" 2 పేతురు 3:2 అని పేతురు వారిని కోరియున్నాడు. వారిని హెచ్చరించుటలో పేతురు యొక్క ఉద్దేశము, దేవునిచే ఏర్పరచబడిన వారిని ఎదుర్కొను, అబద్ద బోధకులు, అధిక లోభులైనవారు, దురాశల ననుసరించువారు, అధికారము కోరుకొనువారు మరియు అపహసించు అపహాసకులందరి కొరకు వారిని సిద్ధపరచుట. దయచేసి 2 పేతురు 2, 3 అధ్యాయ ములను చదువుము.